క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

దహెగాం: వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, గ్రామ సమాఖ్య సభ్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. వరదల సమయంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. అదే విధంగా లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. తహసీల్దార్ మినవర్ షరీఫ్, ఎంపీడీవో అల్బర్ట్, ఎస్సై విక్రమ్, ఎంపీవో రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, పీఆర్‌ఏఈ ఆత్మారాం, ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



ప్రమోద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: ఇటీవల బదిలీపై వచ్చిన కౌటాల తహసీల్దార్ వి.ప్రమోద్‌ను మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదే నాందేవ్, మండల అధ్యక్షుడు సిండే నాందేవ్, నాయకులు శ్రీనివాస్, జ్యోతిరావు, మోర్లె పాండురంగ్, శంకర్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడిపొడి చెత్త వేరుగా సేకరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: తడిపొడి చెత్తను వేరుగా సేకరించి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య పేర్కొన్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4,5 వార్డుల్లో తడిపొడి చెత్త సేకరణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, టీపీబీవో, వార్డు అధికారులు రాజు, సాయి, ప్రజలు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన స్థలంపై విచారణ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని తీరందాజ్ టాకీస్ వెనకాల ప్రధాన కాలువను ఆక్రమించుకుని అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న స్థలంపై మంగళవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్య సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలను తొలగిస్తామన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో ఆడే ప్రకాశ్ తెలిపారు. ఈనెల 12న పునఃపాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మోడి కేజీబీవీకి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలకు 14233 పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని ఎంఈవో సుభాష్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇప్పల్ నవెగాం, తెనుగు గూడ గ్రామంలోని ఉపాధి పనులు చేస్తున్న గ్రామస్తులకు ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఊషన్న, ఉపాధ్యక్షుడు ఇందురావ్, కార్యదర్శి హేమంత్ షిండే, కోశాధికారి రమేశ్, సలీం పాల్గొన్నారు.

కోతులతో పరేషాన్

- రోడ్లపై గుంపులు, గుంపులుగా సంచారం
- ఇళ్లలో చొరబడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కౌటాలకు చెందిన తాళ్లపెల్లి నిత్యశ్రీ పై ఇటీవల కోతుల దాడిలో గాయాలపాలైంది. స్థానిక ప్రగతి కాలనీలోని తమ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో కోతులు దాడి చేసి గాయపర్చాయి. చికిత్స నిమిత్తం కౌటాల పీహెచ్‌సీకి తరలించగా.. మందులు అందుబాటులో లేక సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి వెళ్లింది. కౌటాలలో కోతుల బెడద నివారించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.



కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు



బైక్ సీటు కవర్‌ను చింపేస్తున్న కోతి

కౌటాల: అటవీప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల బాటపట్టాయి. ఊళ్లలోకి చేరి వీరంగం సృష్టిస్తున్నాయి. చేతిలో వస్తువులు పట్టుకుని రోడ్డు వెంట నడవాలన్నా.. చిన్నపిల్లలు బయట తిరగాలన్నా.. ఇంటి తలుపులు తెరిచి ఉన్నా ఇబ్బందులు తప్పడం లేదు. కౌటాల మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇదిలా ఉంటే ఇళ్లలో, కిరాణ దుకాణాల్లో వస్తువులు, తినుబండారాలను లాక్కెళ్తున్నాయి. దీంతో కోతులను కర్రలు పట్టి బెదిరించి తరిమేస్తున్నారు. ఇలాంటి పనులు ప్రజలకు నిత్యకత్యంగా మారాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం కార్యాలయాల ముందు ఉన్న చెట్లపై కోతులు బారులు తీరి ఉంటున్నాయి. ఎవరైన కార్యాలయాలకు వచ్చిన వారిపై కోతులు దాడులకు దిగుతున్నాయి. దీంతో ప్రజలు వాటి బారిన పడకుండా పరుగులు తీస్తున్నారు. పార్కింగ్ చేసిన బైక్‌ల సీటు కవర్‌లో పండ్లు, కూరగాయలు, తినుబండారాలను ఎత్తుకుపోవడంతోపాటు సీట్ కవర్‌ను చింపేస్తున్నాయి. అలాగే వాహనాలపై గెంతులు వేస్తు హంగామా చేస్తున్నాయి. కౌటాల–బెజ్జూర్ రహదారిపై వెళ్లే రాకపోకలు సాగించే వాహనాలను వెంబడిస్తూ పరుగులు పెట్టిస్తున్నాయి. కోతుల బెడదను నివారించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నివారించాలి

కోతులు ఇళ్లలో చొరబడి ఇళ్లలోని వస్తువులను, కూరగాయాలను లాక్కెళ్లి పోతున్నాయి. రేకుల ఇళ్లపైన కోతులు గెంతడంతో ఇళ్ల పైకప్పులు పగిలిపోతున్నాయి. అధికారులు పట్టించుకుని కోతల బెడద నివారించేలా చర్యలు చేపట్టాలి.

– అంజన్న, ప్రగతికాలనీ, కౌటాల

కడంబా గుట్టలపై ప్రాచీన కోట



గుట్టపై ఉన్న కోట గోడ



రక్షణ కోసం పేర్చి ఉన్న రాళ్లు



పహారా కాసేందుకు నిర్మించినట్లు ఉన్న నిర్మాణం

చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ నుంచి డబ్బా మీదుగా చింతలమానెపల్లి మార్గంలో దట్టమైన అటవీప్రాంతం.. కడంబా గ్రామ సమీపంలో కొండ ప్రాంతం ఉంది. ఈ ఎత్తైన కొండ పలు చారిత్రక విశేషాలకే నిలయంగా ఉంది. ఆదరణ లేక ఈ చారిత్రక విశేషాలు అవశేషాలుగా మారుతున్నాయి. కడంబా గుట్టగా స్థానికులు పిలుచుకునే ఈ కొండపై ప్రాంతం విశాలంగా ఉంటుంది. ఇక్కడ ఎన్ని సంవత్సరాల క్రితం నిర్మించారో అంచనా వేయలేని కోట శిథిలాలు ఉన్నాయి. పెద్ద రాళ్లతో నిర్మించిన గోడలు, నైపుణ్యంతో నిర్మించిన ప్రహరీ కనిపిస్తాయి. నిర్మించిన కోటకు లేదా ప్రాంతానికి పహారా కాసేందుకు గోడల నిర్మాణం ఉంటుంది. ప్ర. దాన ద్వారం శిథిలమైపోయి ఉండగా ఇక్కడ కొన్ని దేవత విగ్రహాలు కనిపిస్తాయి. చుట్టూపక్కల ఉన్న ప్రాంతాలన్నీ కనిపించేలా ఈప్రాంతం ఎత్తులో ఉంది. వేసవిలో నీటితో ప్రవహించే సహజ ఊటలు, దట్టమైన చెట్లు ప్రకృతి అందాలతో ఈ ప్రాంతం కనిపిస్తుంది. ఇక్కడ కొలువైన చిలకల భీమన్నను స్థానికులు కొందరు ప్రతీ ఏటా కొలుస్తుంటారు. ఈ ప్రాంతంలోని శిథిలమవుతున్న కోటగోడల వెనుక ఉన్న చరిత్రను వెలికితీయాలని, వాటిని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి రోడ్డు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేపడుతున్న ఐనం గ్రామస్తులు

దహెగాం: ఉన్న మండలంలోని ఐనం నుంచి పోలంపల్లి గ్రామానికి అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును పూర్తిచేయాలని గ్రామస్తులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఐనం నుంచి పోలంపల్లి గ్రామానికి గత మూడేళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరై పనులు ప్రారంభించినా పూర్తి కాలేదన్నారు. కాంట్రాక్టర్ కంకర పోసి పనులు నిలిపివేశారన్నారు. దీంతో గ్రామస్తులు, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి



దహెగాంలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



వాంకిడి: దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్

దహెగాం: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించిందని తహసీల్దార్ మునవర్ షరీఫ్ తెలిపారు. మండల కేంద్రంతోపాటు బీబ్రా గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా శాశ్వత భూసమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎలాంటి భూతగాదాలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీటీ గణేష్, ఆర్ఐ నాగభూషణం రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిశీలించాలి

వాంకిడి: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను రికార్డుల ఆధారంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అధికారులకు సూచించారు. మండలంలోని జైత్‌పూర్, ఘాట్‌జనగాం గ్రామాల్లో భూభారతి చట్టంపై మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. తహసీల్దార్ కవిత, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌లాల్, ఆర్ఐ మాజిత్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: బారెగూడ, కోసిని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి రైతుల నుంచి అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ మధుకర్ తెలిపారు. తొలిరోజు 32 దరఖాస్తులు వచ్చాయని, పట్టా పాసుపుస్తకాల్లో పేరు మార్పు, సాదాబైనామా, సర్వే నంబర్ల తప్పు, పట్టా ఒకరు కబ్జాలో ఒకరు తదితర అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. డీటీ సరిత, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): అచ్చెల్లి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను సిర్పూర్(టి) తహసీల్దార్ రహీముద్దిన్ స్వీకరించారు. మొత్తం 29 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

బెజ్జూర్: మొగవెల్లి, అంబగట్ట గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో పలువురి నుంచి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ రాంమోహన్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ భీమ్లానాయక్, ఆర్ఐ అచ్యుత్‌రావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కౌటాల: వీరవెల్లి, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సుల్లో 40 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ ప్రమోద్ తెలిపారు. ఆర్ఐ దేవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షీటీం ద్వారా అవగాహన సదస్సులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు, చిన్నపిల్లలకు చట్టాలపై షీటీం ద్వారా జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మే నెలలో షీటీంల ద్వారా 104 హాట్‌స్పాట్ ప్రదేశాలు గుర్తించామని, 25 అవగాహన సదస్సులు నిర్వహించామని పేర్కొన్నారు. 12 ఫిర్యాదులు స్వీకరించగా మూడు ఎఫ్ఐఆర్, రెండు ఈపెట్టి కేసులు నమోదు చేసి మిగతావారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలి పారు. మహిళలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా గామ్‌లో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే స మయంలో వ్యక్తిగత భద్రత చర్యలు తీసుకో వాలని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఆసిఫాబాద్ షీటీంను 8712670564, కాగజ్‌నగర్ షీటీంను 8712670565 నంబర్లలో లే దా 'డయల్ 100'ను సంప్రదించాలని సూ చించారు.

'పది' పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు మూడు కేంద్రాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు 209 మంది విద్యార్థులకు 173 మంది హాజరు కాగా, 36 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, డీఈవో యాదయ్య తెలిపారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు సబ్జెక్టు పరీక్ష కేంద్రంలో మొత్తం 51 మంది విద్యార్థులకు గాను 40 మంది పరీక్షకు హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

కెరమెరి: మండలంలోని రాంనగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో అంజద్‌పాషా మంగళవారం భూమి పూజ చేశారు. మండలంలోని 29 పంచాయతీలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా 194 ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఏఈ రత్నం, పంచాయతీ కార్యదర్శి ప్రేంకుమార్ ఉన్నారు.

బ్యాంకులో ప్రత్యేక కౌంటర్

కాగజ్‌నగర్‌టౌన్: సీనియర్ సిటిజన్స్ కోసం స్టేట్ బ్యాంక్‌లో ప్రత్యేక కౌంటర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, సభ్యులు మహబూబ్, సుభాష్, సునీల్, విస్తారు, ఒదయ్య, శంకర్, కిషన్, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

పోచమ్మతల్లికి ఆదివాసీల పూజలు



కాలినడకన వెళ్తున్న ఆదివాసీలు



పోచమ్మకు విత్తన పూజలు చేస్తున్న కటోడాలు

కెరమెరి: మృగశిర కార్తె త్వరలో ప్రవేశించనుండడంతో విత్తన పూజలకు ఆదివాసీలు నడుంబిగించారు. ఎన్నో ఏళ్లుగా ఆరాధించి పూజిస్తున్న పోచమ్మ తల్లికి మంగళవారం ఆదివాసీలు పూజలు చేశారు. కెరమెరి మండలం మోడి, చిన్న సాకడ, సాకడబి, చింతకర్ర, బాబేఝరి, కెస్లాగూడ, తోయగూడ, పవర్‌గూడ గ్రామాల ఆదివాసీలు కాలినడకన వెళ్లి జైనూర్ మండలం సుంగాపూర్ గ్రామ సమీపంలోని అడవిలో కొలువైన పోచమ్మ తల్లి ఎదుట విత్తనాలతో ప్రత్యేక పూజలు చేశారు. తమ పంటల్లో విత్తే విత్తనాలను తీసుకెళ్లి నవధాన్యాలతో పూజలు నిర్వహించారు. అక్కడే విందు భోజనాలు చేశారు. సంప్రదాయ వంటలను అమ్మవారికి నైవేద్యంగా చూపించారు. గ్రామాల పెద్దలు, కోడాలు పెందోర్ మోతిరాం, తుకారాం, అంబాజీ, మహదు, జలపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కౌటాల: ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని తెలిపారు. ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులు ఉన్నా అధికారులు పోస్టులు లేవని కారణాలు చూపిస్తూ తమను రెగ్యులర్ చేయడం లేదని ఆరోపించారు. అధ్యాపకులు ఆంజనేయులు, మోతిలాల్ నాయక్, రాము, రవీందర్ పాల్గొన్నారు.

నిషేధిత స్థలంలో వ్యర్థాలు



కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నంబర్ 23లో నిషేధిత స్థలంలో వ్యర్థాలతో నిండి ఉంది. అధికారులు ఈ స్థలంలో ఎలాంటి చెత్త వేయరాదనే సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. చెత్తను వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని, బోర్డు ఉన్నా కాలనీవాసులు ఇంటి పరిసరాల చెత్తను తెచ్చి అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లేవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు



దహెగాంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త తిరుపతి, ఏవో రామకృష్ణ

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనం–రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తుందని బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రైతులకు వరి, కంది, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. విత్తనోత్పత్తి ద్వారా సహచర రైతులకు అందించవచ్చన్నారు. ఏవో రామకృష్ణ, ఏఈవో వంశీ, రైతులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని రైతువేదికలో మేలైన విత్తనాల సేకరణపై జగిత్యాల జిల్లా పొలస పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతుల ద్వారానే విత్తనోత్పత్తి చేయించి తోటి రైతులకు అమ్ముకునేలా ప్రభుత్వం గ్రామాల్లో విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి, కంది, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనం ప్రాముఖ్యత, విత్తనోత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌నాయక్, శ్రీకాంత్, రత్నాకర్, ఏఈవోలు తాండవ కృష్ణ, శంకర్, రాజేశ్వర్, మానస, అరవింద్, పరిమళ, వెంకటేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోని పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త బలరాం అన్నారు. నాణ్యమైన విత్తనం–రైతన్న నేస్తంలో భాగంగా మంగళవారం చింతపల్లి రైతువేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను ఎంచుకుని సాగు చేయడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ రెవెన్యూ గ్రామంలోని ఎంపికై న రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో వినయ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: రైతులు విత్తనోత్పత్తిలో సంవృద్ధి సాధించాలని పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఏవో దిలీప్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందజేసిన వరి, కంది, పెసర ఉచిత విత్తనాలను మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలం లోని 31 గ్రామాల్లో ముగ్గురు రైతులకు ఎంపిక చేసి ఒక్కో రైతుకు వరి, కంది, పెసర విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్టీఏ నాన్ ఎక్స్‌ఆఫీషియల్ సభ్యులు లావుడ్య రమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ ఎంపీటీసీ రఘుపతి, ఏఈవోలు రాకేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

కౌటాల: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తంలో భాగంగా మంగళవారం కౌటాల రైతు వేదికలో అర్హులైన రైతులకు ఆయన విత్తనాలు పంపిణీ చేశారు. ప్రొఫెసర్ కుమారస్వామి, ఏవో ప్రేమలత, సీఈఓ బి.రాజేశ్, ఏఈవోలు అంజన్న, ఘాన్‌శ్యాం, కవిత, కల్పన, రేష్మిత, సిద్ధార్థ, రైతులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని తిరందాజ్ బస్తీ, మార్కెట్ ఏరియా, బాలాజీనగర్, ద్వారకానగర్, కౌసర్‌నగర్ కాలనీల్లో మంగళవారం తాగునీరు కలుషితమైంది. నీరు నాచు, బురదమయంగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి శుద్ధ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.